క్లుప్తంగా

వేసవి శిక్షణ తరగతులు ప్రారంభం



సత్యనారాయణపురం(విజయవాడసెంట్రల్): స్థానిక చిత్తరంజన్ గ్రంథాలయంలో సోమవారం వేసవి విజ్ఞాన తరగతులు ప్రారంభమయ్యాయి. ఈ శిబిరంలో పెద్ద సంఖ్యలో పలు ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా శారద కళాశాల ప్రిన్సిపాల్ లుక్క శ్రీధర్ పాల్గొని గ్రంథాలయాలు, వాటి ఉపయోగాలు, విద్యార్థులు గ్రంథాలయాల పట్ల మక్కువ పెంచుకోవడం వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. అనంతరం గ్రంథాలయ అధికారి సంపత్‌కుమార్ గ్రంథాలయ పితామహులు అయ్యంకి వెంకటరమణయ్య, వావిలాల గోపాలకృష్ణయ్య, పాతూరి నాగభూషణం జీవిత చరిత్రలను వివరించారు.

మజ్జిగ పంపిణీ కేంద్రం ప్రారంభం



విజయవాడ కల్చరల్: సాంస్కృతిక సేవా సంస్థల ప్రజాసేవలో భాగస్వాములు కావాలని శ్రీ కృష్ణదేవరాయ విగ్రహ సాంస్కృతిక వ్యవస్థాపకుడు శీలం నాగేశ్వరరావు అన్నారు. విగ్రహ కమిటీ, సాయిదుర్గాహోమ్ నీడ్స్ ఆధ్వర్యంలో బీఆర్‌టీఎస్ రోడ్డులో సోమవారం 60 రోజులపాటు నిర్వహించే మజ్జిగ పంపిణీ కేంద్రం, పేదలకు అన్నదాన శిబిరాన్ని ప్రారంభించారు. శీలం నాగేశ్వరరావు మాట్లాడుతూ చలివేంద్రాలను, అన్నదాన శిబిరాలను ప్రజలు ఉపయోగించుకోవాలని, నగరంలోని రద్దీ ప్రాంతాలలో సేవా కేంద్రాలను ప్రారంభించాలని సూచించారు. కార్యక్రమంలో శెట్టి శ్రీనివాసరావు, రాజారావు, సీహెచ్ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

డ్రంకెన్ డ్రైవ్ చేసిన 65 మందికి జరిమానా

విజయవాడలీగల్: నగరంలో మద్యం తాగి వాహనాలు నడిపిన 65 మందికి న్యాయస్థానం జరిమానా విధించింది. విజయవాడ నగర పోలీసు కమిషనర్ ఎస్.వి.రాజశేఖరబాబు ఆదేశాల మేరకు నగరంలో మద్యం తాగి వాహనాలు నడుపుతున్న 65 మందిపై 2, 4, 5వ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్లలో కేసులు నమోదు చేశారు. 65 మందిని కోర్టులో హాజరుపరచగా, న్యాయమూర్తి లెనిన్‌బాబు 12 మందికి ఒక్కొక్కరికీ రూ.15వేలు చొప్పున, మిగిలిన 53మందికి ఒక్కొక్కరికీ రూ.10వేలు చొప్పున జరిమానా విధిస్తూ ఆదేశాలు జారీచేశారు. ప్రతిరోజు ప్రత్యేక డ్రంకెన్ డ్రైవ్ నిర్వహించి, మద్యం తాగి వాహనాలు నడుపుతున్న వారిపై మోటారు వాహనాల చట్టం ప్రకారం కేసులు నమోదు చేస్తామని పోలీసులు చెప్పారు.

ప్రజల దాహార్తిని తీర్చాలి



వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): వేసవిలో పాదచారుల దాహార్తిని తీర్చటానికి అవకాశం ఉన్న ప్రతి ఒక్కరూ చలివేంద్రాలను ఏర్పాటు చేయాలని వెస్ట్‌జోన్ ఏసీపీ దుర్గారావు అన్నారు. వన్‌టౌన్ పీఎస్ ఆధ్వర్యంలో స్టేషన్ ఎదుట ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఏసీపీ దుర్గారావు సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా దుర్గారావు మాట్లాడుతూ ఎండలకు పాదచారులు తీవ్రంగా ప్రభావితమయ్యే అవకాశముందన్నారు. పాతబస్తీకి నిత్యం లక్షలాది మంది రాకపోకలు సాగిస్తుంటారని, అటువంటి వారికి దాహార్తిని తీర్చటానికి అవకాశం ఉన్న వారు చలివేంద్రాలను ఏర్పాటు చేయాలని సూచించారు. వన్‌టౌన్ సీఐ గురుప్రకాష్ పాల్గొన్నారు.

కూటమి హామీలను నిలబెట్టుకోవాలి

ముఠా కార్మిక సంఘం నేతలు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): ముఠా కార్మికుల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను నిలబెట్టుకోవాలని ముఠా కార్మిక సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు నాగిరెడ్డి శ్రీనివాసరెడ్డి, చొప్ప శ్రీరామచంద్రమూర్తి డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా లెనిన్‌భవన్‌లో సోమవారం నిర్వహించిన మీడియా సమావేశంలో వారు మాట్లాడారు. ముఠా కార్మిక సంఘం 43వ మహాసభ ఇటీవల అత్యంత ఘనంగా జరుపుకున్నామన్నారు. ముఠా కార్మికుల సంక్షేమానికి సంబంధించి అనేక అంశాలపై మహాసభ చర్చించిందన్నారు. సభలో పలు అంశాలపై తీర్మానాలు చేశామన్నారు. అందులో భాగంగా ముఠా కార్మికుల హక్కులు కాపాడేందుకు సమగ్ర చట్టాన్ని ఏర్పాటు చేయాలన్నారు. ప్రత్యేక నిధిని ఏర్పాటు చేయాలని, ప్రభుత్వం ఈఎస్ఐ, ఈపీఎఫ్ సౌకర్యాలను కల్పించాలని కోరారు. మహాసభ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకుందన్నారు. గౌరవాధ్యక్షుడిగా వియ్యపు నాగేశ్వరరావు, అధ్యక్షుడిగా నాగిరెడ్డి శ్రీనివాసరెడ్డి, ఉపాధ్యక్షులుగా కోరే కొండలరావు, చిన్న ఆవులయ్య, కె.శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శిగా చొప్ప శ్రీరామచంద్రమూర్తి తదితరులను ఎన్నుకున్నారు.

మునుగుతున్నా.. మార్పు రాదే!

- బుడమేరులో ఆగని ఆక్రమణలు
- కాలువ పరీవాహక ప్రాంతాలను పూడ్చేసి ప్లాట్లు వేస్తున్న వైనం
- చేష్టలుడిగిన అధికారులు
- బుడమేరు ప్రక్షాళన ఒట్టిమాటే!



మూడు అడుగుల జాగా కూడా లేని చోట.. బుడమేరులో చెట్లు నరికేసి ముప్పై అడుగుల రోడ్డు తయారు చేస్తున్న దృశ్యం

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): సర్వం కోల్పోయిన కుటుంబాలు కొన్ని.. తిండి లేక ఆకలి కేకలు వేసిన కుటుంబాలు మరికొన్ని.. రూ. లక్షల్లో ఆస్తి నష్టపోయిన కుటుంబాలు ఇంకొన్ని.. వెరసి బుడమేరు వరద బెజవాడ వాసులకు ఓ పెద్ద పీడకల. అంతటి ప్రళయానికి ప్రధాన కారణం అధికారుల నిర్లక్ష్యంతో పాటు బుడమేరు ఆక్రమణలు. వరద సమయంలో హడావుడి చేసిన సర్కారు.. బుడమేరు ప్రక్షాళన చేస్తామంటూ ప్రకటనలిచ్చింది. అయితే ప్రస్తుత పరిస్థితి చూస్తే ఎలాంటి మార్పు కనిపించడం లేదు. ఆక్రమణదారులు యథావిధిగా తమ ఆక్రమణలను కొనసాగిస్తున్నారు. ఇష్టం వచ్చినట్లుగా బుడమేరు పూడ్చేసి ప్లాట్లుగా మార్చేసి విక్రయాలు చేసేస్తున్నారు.

ఆపేదెవరు?

బుడమేరు వరదలు వచ్చి ఏడు నెలలు గడుస్తున్నా .. ఆ గాయాలు ఇంకా ఇక్కడి నివాసితులను కలవరపెడుతూనే ఉన్నాయి. బుడమేరు ప్రక్షాళన చేపడతాం.. బుడమేరులో ఆక్రమణలు తొలగించేస్తాం.. అంటూ అప్పుడు మీడియా ముందు ప్రభుత్వ పెద్దలు.. ఉన్నతాధికారులు ఊదరగొట్టారు. సీన్ కట్‌చేస్తే.. బుడమేరులో ఆక్రమణలు తొలగింపు సరికాదు కదా కనీసం ఉన్న కొంచెం బుడమేరును సైతం కాపాడేందుకు ముందుకు రావడం లేదు. కొంతమంది ప్రభుత్వ పెద్దలు అండదండలతో బుడమేరును యథేచ్ఛగా ఆక్రమించేస్తున్నారు. న్యూరాజరాజేశ్వరీపేట పోలీస్‌స్టేషన్ ఎదురు రోడ్లు, రైల్వే ట్రాక్ వెంబడి, సన్‌సిటీ కాలనీ, ఇందిరానాయక్‌నగర్, భారతమాత మందిరం రోడ్డు వెనుక ప్రాంతాలతో పాటు బుడమేరు సెంటర్, రామకృష్ణాపురం ప్రాంతాలలో సైతం బుడమేరుపు పూడ్చేస్తున్నారు. రాత్రికి రాత్రే బుడమేరులో చెత్త, మట్టి పోసేసి రోడ్లు తయారుచేయడం, ప్లాట్లుగా మలిచేయడం.. వాటికి దొంగ సర్వే నంబర్లతో నకిలీ డాక్యుమెంట్లను సృష్టించేయడం.. అమాయక ప్రజలకు వాటిని విక్రయించేస్తూ.. లక్షల రూపాయలను కాజేసేస్తున్నారు.

చర్యలేవి?

బుడమేరులో ఆక్రమణలను అడ్డుకట్ట వేయాల్సిన ఇరిగేషన్, కార్పొరేషన్ టౌన్‌ప్లానింగ్ విభాగ అధికారులు ఒక్కరు కూడా వీటిపై చర్యలు తీసుకునేందుకు ముందుకు రావడం లేదు. బుడమేరును ఆక్రమించేస్తున్నారని.. బుడమేరులో షెడ్లు వేసేస్తున్నారని ఫిర్యాదులు వస్తుంటే.. ఈ శాఖల నుంచి వెళ్తున్న వారు సదరు ఆక్రమణదారులతో మాట్లాడుకొని వారిచ్చిన నోట్ల కట్లను తీసుకొని నోటిమీద వేలేసుకొని ఊరకుంటున్నారే తప్ప ఆ ఆక్రమణలను అడ్డుకొని కట్టడం చేయడం కానీ.. నోటీసులు ఇచ్చి చర్యలు తీసుకోవడం కానీ చేయడం లేదని ఆరోపణలు అనేకం వినిపిస్తున్నాయి. మరికొన్ని చోట్ల ఏకంగా ఈ శాఖల్లోని అధికారులు ఆక్రమణదారులకు వెన్నుదన్నుగా నిలిచి ఆక్రమణలను ప్రోత్సహిస్తున్నారనే విమర్శలు వస్తున్నాయి.

ఇప్పటికైనా కళ్లు తెరిస్తేనే..

బుడమేరులో జరిగిన ఆక్రమణల వల్లే బుడమేరు వరదలు సంభవించాయని చెప్పుకొచ్చిన ప్రభుత్వ పెద్దలు.. మళ్లీ ఇటువంటి ఆక్రమణలు పెరిగిపోతే భవిష్యత్తులో వీటి వల్ల జరిగే మరో ఘోర తప్పిదాన్ని ప్రోత్సహించిన వారవుతారు. ప్రస్తుతం వేసవి కాలంలో బుడమేరులో నీళ్లు లేవనో.. బుడమేరును పూడ్చడం తేలికేనని ఆక్రమించేస్తే రానున్న వర్షాకాలంలో నీటి ప్రవాహం పెరిగినప్పుడు ఆ నీరు కదిలే మార్గం లేక మళ్లీ వరదలు సంభవించే ప్రమాదం ఎదురవుతుంది. ఇప్పటికైనా ప్రభుత్వ పెద్దలు.. సంబంధిత ఉన్నతాధికారులు బుడమేరులో జరుగుతున్న ఆక్రమణలకు అడ్డుకట్ట వేయాలని.. అమాయక ప్రజలు నష్టపోకుండా చర్యలు తీసుకోవాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.



బుడమేరును పూడ్చేసి.. రోడ్డును విస్తరించిన ఆక్రమణదారులు



ఇందిరానగర్‌లో బుడమేరును చెత్త, మట్టితో పూడ్చేస్తున్న దృశ్యం

వైఎస్ జగన్‌ను విమర్శించే స్థాయి ఎంపీ చిన్నికి లేదు

వైఎస్సార్ సీపీ సెంట్రల్ నియోజకవర్గ సమన్వయకర్త మల్లాది విష్ణు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై ఎంపీ కేశినేని చిన్ని వ్యాఖ్యలు అర్థరహితమని వైఎస్సార్ సీపీ సెంట్రల్ నియోజకవర్గ సమన్వయకర్త మల్లాది విష్ణు అన్నారు. ఈ మేరకు సోమవారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 11 నెలల కాలంలో ఏ ఒక్క హామీ అమలు చేయలేదన్నారు. రూ. లక్షన్నర కోట్ల అప్పులు చేసిందన్నారు. ల్యాండ్, శాండ్, వైన్, మైన్ అన్నింటిలోనూ దోపిడీ పెరిగిపోయిందన్నారు. దీనిపై ఎంపీ కేశినేని చిన్ని వివరణ ఇవ్వకపోగా మాజీ ముఖ్యమంత్రిని విమర్శించడం ఏమిటని ధ్వజమెత్తారు. కనీసం కేశినేని చిన్నికి తన పార్లమెంట్ నియోజకవర్గంలో ఏం జరుగుతుందో తెలుసా..? అని ప్రశ్నించారు. అటువంటి వ్యక్తి వైఎస్ జగన్ గురించి మాట్లాడటం హాస్యాస్పదమన్నారు. వైఎస్ జగన్ ముఖ్యమంత్రి కాగానే నవరత్నాల పథకాలను అమలు చేశారని గుర్తు చేశారు.

ఇసుక టెండర్లను రద్దు చేయాలి..

ఉమ్మడి కృష్ణా జిల్లాలో ఇసుక, మట్టి మాఫియా పేట్రేగిపోతోందని మల్లాది విష్ణు అన్నారు. ఈ ప్రభుత్వంలో ఎంపీలు, ఎమ్మెల్యేల నుంచి కిందిస్థాయి కార్యకర్తల వరకు ఇసుక, మట్టి ఒక ఆదాయ వనరుగా మార్చేశారన్నారు. కూటమి నేతలు ఇసుక దోపిడీకి తెరతీశారన్నారు. యంత్రాలతో యథేచ్ఛగా తవ్వకాలు జరుపుతూ.. టన్నుల కొద్దీ ఇసుకను ఏకంగా హైదరాబాద్‌కు తరలిస్తున్నారని ఆరోపించారు. ఇసుక టెండర్లను రద్దు చేయాలని డిమాండ్ చేశారు.

చివరి ధాన్యపు గింజ వరకు..

కూటమి ప్రభుత్వం అనుసరిస్తున్న రైతు వ్యతిరేక విధానాలతో అన్నదాతలు ఆత్మహత్యల పాలవుతున్నారన్నారు. ఈ ప్రభుత్వంలో 200 మంది ఆత్మహత్యలకు పాల్పడ్డారన్నారు. ధాన్యం కొనుగోళ్లలోనూ అక్రమాలు జరుగుతున్నాయన్నారు. రైతుల నుంచి చివరి ధాన్యపు గింజవరకు గిట్టుబాటు ధరకు కొనుగోలు చేయాలన్నారు.

పాయకాపురం పార్కు అభివృద్ధికి రూ. 2కోట్లు

వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర



పాయకాపురంలో పార్కును పరిశీలిస్తున్న వీఎంసీ కమిషనర్ ధ్యాన్యచంద్ర

పాయకాపురం(విజయవాడరూరల్): పాయకాపురంలో చెరువు పార్కు అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం అమృత్ పథకం కింద రెండు కోట్ల రూపాయలను మంజూరు చేసిందని విజయవాడ నగర పాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర పేర్కొన్నారు. సోమవారం పాయకాపురంలో పార్కును కమిషనర్ పరిశీలించారు. బోటు షికారు చేయాల్సిన చెరువు ప్రాంతాన్ని పరిశీలించారు. చెరువులో పెరిగిన మొక్కలను, సిల్టును తొలగించి పరిశుభ్రంగా ఉంచాలన్నారు. చెరువు చుట్టూ రాతి ఫెన్సింగ్ ఏర్పాటు చేసే పనులపై అధికారులతో మాట్లాడారు. పార్కులో అసంపూర్తిగా మిగిలిపోయిన పనులను సకాలంలో పూర్తి చేయాలని ఈఈ చంద్రశేఖర్‌కు సూచించారు. అనంతరం 64వ డివిజన్లో అవుట్‌ఫాల్ డ్రెయినేజీ నిర్మాణ పనులను కమిషనర్ పరిశీలించారు. వేగవంతంగా పనులు జరిగేలా చూడాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. ఈ పనుల కారణంగా కింది భాగంలో ఉన్న నీటి సరఫరా పైపులైను పగిలిపోయి ప్రజలకు నీటి సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని స్థానికులు అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. కమిషనర్ వెంట చీఫ్ మెడికల్ ఆఫీసర్ గోపాల్‌నాయక్, ఎగ్జిక్యూటివ్ ఇంజినీరు శ్రీనివాసరెడ్డి, డీఈ లక్ష్మి సింధూర ఉన్నారు.

బసవపున్నయ్య స్టేడియం అభివృద్ధికి చర్యలు..

పటమట(విజయవాడతూర్పు): నగర పర్యటనలో భాగంగా కమిషనర్ సోమవారం అజిత్ సింగ్ నగర్‌లోని మాకినేని బసవపున్నయ్య స్టేడియం, కండ్రిక ప్రాంతాలన్నీ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ మాకినేని బసవపున్నయ్య స్టేడియంలో వాకింగ్ ట్రాక్, జిమ్ ఎక్విప్మెంట్, మరుగుదొడ్లను నిర్మించాలని అధికారులను ఆదేశించారు. కండ్రికలో అమృత్ ఇన్సెంటివ్ నిధులలో భాగంగా జరుగుతున్న డ్రెయిన్ నిర్మాణ పనులను పరిశీలించారు.

ప్రతి సమస్యకు శాశ్వత పరిష్కారం

వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర



నగరవాసుల నుంచి ఫిర్యాదులను స్వీకరిస్తున్న వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర

పటమట(విజయవాడతూర్పు): నగరంలో ప్రజల సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపాలని వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర అన్నారు. సోమవారం వీఎంసీ ప్రధాన కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ రూంలో ఆయన ప్రజా ఫిర్యాదులు–పరిష్కార కార్యక్రమంలో నగరవాసుల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. ఆయన మాట్లాడుతూ ప్రజా సమస్యలను వేగంగా, సమర్థంగా పరిష్కరించడం నగరపాలక సంస్థ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. ఫిర్యాదులపై వెంటనే స్పందించడంతో పాటు, వాటికి శాశ్వత పరిష్కారం కనుగొనడంపై అధికారులకు సూచనలు ఇచ్చారు. మొత్తం 17 ఫిర్యాదులు అందగా అందులో పట్టణ ప్రణాళిక సంబంధించినవి 4, ఇంజినీరింగ్ 3 , రెవెన్యూ 2, వైద్య, ఆరోగ్యం 2, ఉద్యానవనం 1, ఎస్టేట్ 1, పీఓ యూసీడీ సంబంధించినవి 3, హౌసింగ్ ఒకటి మొత్తం కలిపి 17 ఫిర్యాదులను అందుకున్నారు. కార్యక్రమంలో అదనపు కమిషనర్ ప్రాజెక్ట్స్ డాక్టర్ డి. చంద్రశేఖర్, చీఫ్ సిటీ ప్లానర్ సంజయ్ రత్నకుమార్, చీఫ్ ఇంజినీర్ ఆర్ శ్రీనాథ్‌రెడ్డి, డెప్యూటీ కమిషనర్ రెవెన్యూ జి. సృజన, సూపరింటెండెంటింగ్ ఇంజినీర్లు పి.సత్యనారాయణ, పి.సత్యకుమారి తదితరులు పాల్గొన్నారు.

వీనుల విందుగా సంకీర్తనా గానం



త్యాగరాజ స్వామి కృతిగానం చేస్తున్న కళాకారులు

విజయవాడ కల్చరల్: శ్రీ సద్గురు సంగీత సభ ఆధ్వర్యంలో త్యాగరాజ స్వామి 258వ జయంతి సందర్భంగా శివరామకృష్ణ క్షేత్రంలో సోమవారం నిర్వహించిన జయంతి ఉత్సవాలు, శాస్త్రీయ సంగీత కచేరీ వీనుల విందుగా సాగాయి. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన సంగీత విద్వాంసులు యువ సంగీత కళాకారులు త్యాగరాజ స్వామి రచించిన సంకీర్తనలను మధురంగా గానం చేశారు. వేదాంతం పల్లవి, పి. విజయ, పెందుర్తి విజయలక్ష్మి, జి. సూర్యకాంతి, కాళీపట్నపు ఉమ, ఎన్‌సీపీ శాంతిశ్రీ గాత్రంతోనూ.. టి. శర్వాణి బృందం వయోలిన్ సహాయంతో త్యాగరాజ స్వామి కృతులను ఆలపించారు. ఇంద్రకీలాద్రి శర్మ, వరణ్ చంద్రన్, శ్రీ కృష్ణ, సూర్య, నేతి శివశంకర్ వాద్య సహకారమందించారు. సద్గురు సంగీత సభ కార్యదర్శి గౌరీనాథ్ మాట్లాడుతూ త్యాగరాజ స్వామి నాదోపాసకుడన్నారు. సంకీర్తనం ద్వారా భగవంతుని చేరుకోవచ్చని లోకానికి తెలియజేసినట్లు తెలిపారు. సంస్థ అధ్యక్షుడు బీవీఎస్ ప్రకాష్, సభ్యులు హరిప్రసాద్, ప్రసాద్ శర్మ పాల్గొన్నారు.

పర్యాటకులపై ఉగ్రదాడి హేయమైన చర్య



నిరసన తెలుపుతున్న వెలమ సంఘం నాయకులు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): జమ్మూ కశ్మీర్‌లో పర్యాటకులపై ఉగ్రదాడిని ఖండిస్తూ వెలమ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో గాంధీనగర్‌లో నిరసన కార్యక్రమం జరిగింది. దాడి మృతులకు ఘనంగా నివాళులర్పించారు. సంఘం అధ్యక్షులు ఘంటా శ్రీనివాసరావు మాట్లాడుతూ దాడి హేయమైన చర్య అని పేర్కొన్నారు. కోశాధికారి గంటా శ్రీనివాసరావు, రుత్తల శ్రీ లక్ష్మి, రుత్తల వెంకటేశ్వరావు, చింత కాయల నాగ సత్య నారాయణ, గొట్టాపు గోవర్ధన్, మూకల గణేష్ నాయుడు. దత్తి శివ ప్రసాద్, దాసరి బుజ్జి బాబు పాల్గొన్నారు.

భారతి దళిత సేన, హిందూ జేఏసీ ఆధ్వర్యంలో..

కశ్మీర్ మారణకాండకు వ్యతిరేకంగా శ్రామిక భారతి–దళిత సేన, హిందూ జేఏసీ సంయుక్త ఆధ్వర్యంలో బీసెంట్ రోడ్డులో నిరసన ప్రదర్శన జరిగింది. ఉగ్రవాదం నశించాలని నినాదాలు చేశారు. ఇస్లామిక్ తీవ్రవాదాన్ని తుదముట్టించాలని జేఏసీ నేతలు పేర్కొన్నారు. నిరసన కార్యక్రమంలో జేఏసీ నాయకులు నాగలింగం శివాజీ పోతరాజు మాధవ, మురళి దుర్గ, కొరప్రోలు శ్రీనివాస్ పాల్గొన్నారు

తుగ్లక్ నిర్ణయాలతో క్రీడలకు దెబ్బ

టెన్నిస్‌బాల్ క్రికెట్ సంఘం కార్యదర్శి ప్రసాద్



విజయవాడస్పోర్ట్స్: రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల విడుదల చేసిన జీవో 4 ఉత్తర్వులు భవిష్యత్తులో క్రీడాకారుల పాలిట శాపంగా మారనుందని ఆంధ్రప్రదేశ్ టెన్నిస్ బాల్ క్రికెట్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ఆర్.డి.ప్రసాద్ ధ్వజమెత్తారు. ఒక చేతిలో అన్నం పెట్టి, మరో చేతితో లాగేసుకున్నట్లు తాజా క్రీడా కోటా ఉందన్నారు. ఈ ఉత్తర్వులను వెంటనే సవరించాలని, లేదంటే రానున్న రోజుల్లో ఉద్యమం చేయడానికి సిద్ధంగా ఉన్నామని హెచ్చరించారు. విజయవాడలోని ఇందిరాగాంధీ మునిసిపల్ కార్పొరేషన్ స్టేడియంలో సోమవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆర్.డి.ప్రసాద్ మాట్లాడారు. గ్రామీణ క్రీడలు, వాటర్ స్పోర్ట్స్‌ను అభివృద్ధి చేయాలనే ప్రభుత్వ నిర్ణయానికి విరుద్ధంగా ఆంధ్రప్రదేశ్ క్రీడా ప్రాధికార సంస్థ(శాప్) అధికారులు పని చేయడం ఈ రాష్ట్రానికి పట్టిన దౌర్భాగ్యమన్నారు. కొత్త జీవోలో 65 క్రీడలకు గుర్తింపు ఇచ్చారని, అయితే ఏ, బీ కేటగిరీల విభజన సహేతుకం కాదన్నారు. మితిమీరిన రాజకీయ జోక్యంతోనూ క్రీడా వ్యవస్థ మసకబారుతోందన్నారు. సమావేశంలో ఆంధ్రప్రదేశ్ వ్యాయామ ఉపాధ్యాయుల సంఘం ఉపాధ్యక్షులు దనియాల నాగరాజు, అట్యాపాట్యా సంఘం కోశాధికారి కృష్ణారెడ్డి, టెన్నిస్‌బాల్ క్రికెట్ సంఘం కార్యదర్శి స్వామి పాల్గొన్నారు.

కేదారేశ్వరపేట రైతుబజార్‌లో సీఈఓ తనిఖీ

పూర్ణానందంపేట(విజయవాడపశ్చిమ): రైతు బజార్‌ల సీఈఓ కె.మాధవీలత సోమవారం కేదారేశ్వరపేట రైతు బజార్‌లో తనిఖీలు చేశారు. అక్కడ రైతులకు ఎదురవుతున్న సమస్యలు, వారికి కావాల్సిన సౌకర్యాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా రైతులు తాము ఫుట్‌పాత్‌పైన వ్యాపారాలు చేయడం ఇబ్బందిగా ఉందని, వెనుక వైపు ఖాళీగా ఉన్న స్టాల్స్‌ను అభివృద్ధి చేసి అందుబాటులోకి తీసుకురావాలని ఆమె దృష్టికి తీసుకెళ్లారు. వేసవిలో వినియోగదారులకు ఇబ్బంది లేకుండా చూడాలని ఎస్టేట్ ఆఫీసర్ కరుణాకర్‌కు సూచించారు. రైతుబజారు అభివృద్ధికి రూ.46 లక్షల నిధుల అంచనాలతో ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపనున్నట్లు ఆమె తెలిపారు. కార్యక్రమంలో డిస్ట్రిక్ట్ ట్రేడ్ అగ్రికల్చర్ మార్కెటింగ్ శాఖ అధికారిని కె.మంగమ్మ, ఇంజినీరింగ్ శాఖ అధికారులు పాల్గొన్నారు.

అర్హులకు పింఛన్లు మంజూరు చేయండి



వీఎంసీ ప్రధాన కార్యాలయం వద్ద ఆందోళన చేస్తున్న సీపీఎం ఫ్లోర్‌లీడర్ బోయి సత్యబాబు

పటమట(విజయవాడతూర్పు): నగరపాలక సంస్థలోని 64 డివిజన్లలో అర్హులకు వృద్ధాప్య, వితంతు, వికలాంగ, ఒంటరి మహిళ తదితర సంక్షేమ సామాజిక పెన్షన్లు వెంటనే మంజూరు చేయాలని సీపీఎం ఫ్లోర్‌లీడర్ బోయి సత్యబాబు విజ్ఞప్తి చేశారు. సోమవారం వీఎంసీ ప్రధాన కార్యాలయంలో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) వద్ద అర్హులైన లబ్ధిదారులతో ఆయన ఆందోళన చేశారు. ఈ సందర్భంగా సత్యబాబు మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడి 11 నెలలు పూర్తవుతున్నా, సచివాలయంలో అర్హులైన పెన్షన్ లబ్ధిదారులు దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం కల్పించకపోవడం శోచనీయమని, ఇది సంక్షేమ ప్రభుత్వం కాదని ఆవేదన వ్యక్తం చేశారు. పేద లబ్ధిదారుల అర్హతలను కూడా పరిగణనలోకి తీసుకోకపోవడం దురదృష్టకరమని పేర్కొన్నారు. 2023 డిసెంబర్ నుంచి ఇప్పటివరకు పెన్షన్ తీసుకుంటూ మరణించిన లబ్ధిదారుని భార్యకు మాత్రమే పింఛన్ ఇస్తామని ఉత్తర్వులు జారీ చేయడం విడ్డూరంగా ఉందన్నారు. అర్హులకు పెన్షన్లు మంజూరు చేయకపోతే సచివాలయం వద్ద సీపీఎం ఆధ్వర్యంలో అర్హులైన పెన్షన్ లబ్ధిదారులతో ఆందోళన, పోరాటం చేస్తామని పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే సూపర్‌సిక్స్ అమలు చేస్తామని ఎన్నికల్లో హామీ ఇచ్చారని, ప్రభుత్వం ఏర్పడి 11 నెలలు పూర్తయినా ఒక్క హామీ కూడా నెరవేర్చకుండా కాలయాపన చేయడం రాష్ట్ర ప్రజలను మోసం చేయడమేనని ఆగ్రహం వ్యక్తం చేశారు.

వీఎంసీ కార్పొరేటర్లు నాగర్‌కోయిల్ కార్పొరేషన్ సందర్శన



నాగర్‌కోయిల్ కార్పొరేషన్ కౌన్సిల్ హాలులో వీఎంసీ కార్పొరేటర్లు

పటమట(విజయవాడతూర్పు): దక్షిణాది రాష్ట్రాల స్టడీ టూర్‌లో భాగంగా వీఎంసీ కార్పొరేటర్లు సోమవారం తమిళనాడులోని నాగర్‌కోయిల్ కార్పొరేషన్‌ను సందర్శించారు. వీఎంసీ కార్పొరేటర్లను నాగర్‌కోయిల్ మేయర్ మహేష్, కమిషనర్ నిశాంత్‌కృష్ణ ఆహ్వానించి అక్కడి స్థితిగతులను వివరించారు. ఈ సందర్భంగా వీరిద్దరూ 54 డివిజన్లు కలిగిన కార్పొరేషన్‌ను 4 జోన్లుగా విభజించి పాలన సాగుతోందన్నారు. కౌన్సిల్ నిర్వహణ విధానం అధికారుల పని తీరు తదితర అంశాలను వివరించారు. ఆరు ఎంఆర్ఎఫ్ ప్లాంట్లతో పారిశుద్ధ్య నిర్వహణ జరుగుతుందని, ఇందులో ప్రత్యేకంగా ఏజెన్సీలతో వ్యర్థాలను సేకరిస్తున్నామని, కీ–పర్ఫామెన్స్ ఇండెక్స్‌తో వారి పనితీరుని పరిశీలిస్తామని వీఎంసీ కార్పొరేటర్లకు వివరించారు. వ్యర్థాలను తూచే కాటా ద్వారా అవి ఏ ప్రాంతం నుంచి వచ్చాయో జీపీఎస్‌తో ట్రాక్ చేస్తామని, ఇలా చేస్తే ఇంటి నుంచి చెత్త సేకరణ 100 శాతం జరుగుతుందని తెలిపారు. వేసవిలో ప్రజలకు తాగునీటి సరఫరాలో అంతరాయం లేకుండా ప్రభుత్వం డ్యాం నుంచి తాగునీటిని విడుదల చేస్తుందని చెప్పారు. నాగర్‌కోయిల్ కార్పొరేషన్ కమిషనర్ నిశాంత్ కృష్ణ మాట్లాడుతూ నగరంలో కోణం ప్రాంతంలో ఒక నాలెడ్జ్ సెంటర్ అందుబాటులో ఉంటుందన్నారు. అనంతరం వీఎంసీ కార్పొరేటర్లు క్షేత్ర స్థాయిలో కోణంలోని నాలెడ్జ్ సెంటర్‌ను పరిశీలించారు.

పదో తరగతి స్కూల్ టాపర్స్‌కు సత్కారం



విద్యార్థులను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

పాయకాపురం(విజయవాడరూరల్): పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో పుచ్చలపల్లి సుందరయ్య మున్సిపల్ హైస్కూల్ నందు అత్యధిక మార్కులు సాధించిన మొదటి ముగ్గురు విద్యార్థులకు ఉపాధ్యాయులు సోమవారం సన్మానం చేశారు. సాయి అక్షయ(575), హర్షవర్ధన్(571), మోహన్ కృష్ణ, శ్రీహిత(566) మార్కులతో మొదటి మూడు స్థానాల్లో నిలవడంతో ప్రధానోపాధ్యాయురాలు కృష్ణ పద్మ వారిని అభినందించారు. వీరితో పాటు సైన్స్ సబ్జెక్ట్‌లో నలుగురు విద్యార్థులు వందకు వంద మార్కులు సాధించారని, 500 పైన 23 మంది విద్యార్థులు మార్కులు సాధించారని హెచ్ఎం తెలియజేశారు. ఉత్తీర్ణులైన విద్యార్థులు భవిష్యత్‌లో ఉన్నత చదువులు చదవాలని ఉపాధ్యాయులు ఆకాంక్షించారు. కార్యక్రమంలో జిల్లా సైన్స్ అధికారి డాక్టర్ మైనం హుస్సేన్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యుత్ లైన్ల తనిఖీలు, మరమ్మతులు

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): సింగ్ నగర్ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని 11కేవీ కనకదుర్గానగర్ ఫీడర్‌లో విద్యుత్ లైన్లను ట్రాన్స్‌కో సిబ్బంది సోమవారం తనిఖీలు చేశారు. ఏఈ కిరణ్‌కుమార్ పర్యవేక్షణలో ఆ ఫీడర్ పరిధిలో ఉన్న పీఅండ్‌టీ కాలనీ, నూకాలమ్మ గుడి, సెయింట్ ఆన్స్ స్కూల్, స్మైల్ హాస్పిటల్ రోడ్, ఆంధ్రపత్రిక కాలనీ, వశిష్ట కాలనీ, ఆంధ్రప్రభ కాలనీ తదితర ప్రాంతాలలో విద్యుత్ వైర్లకు తగులుతూ విద్యుత్ షార్ట్ సర్క్యూట్ సమస్యలకు కారణమవుతున్న చెట్టు కొమ్మలను సిబ్బంది తొలగించారు. పలు విద్యుత్ లైన్లకు మరమ్మతులు నిర్వహించారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం..

సింగ్‌నగర్ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని 57వ డివిజన్ న్యూఆర్ఆర్‌పేట ఫీడర్ పరిధిలో వార్షిక తనిఖీ, మరమ్మతుల నేపథ్యంలో మంగళవారం ఉదయం 8 నుంచి 10 గంటల వరకూ విద్యుత్‌సరఫరాను నిలిపివేస్తున్నట్లు ట్రాన్స్‌కో ఈఈ పి.రవీంద్రబాబు ఓ ప్రకటనలో తెలిపారు. ఆ ఫీడర్ పరిధిలో ఉన్న అమరావతి కాలనీ, సుబ్బరాజునగర్, సుందరమ్మదిబ్బ, న్యూ రాజరాజేశ్వరి పేట పరిసర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని, వినియోగదారులు గమనించి విద్యుత్ శాఖ వారికి సహకరించాలని ఆయన కోరారు.